సాక్షి ప్రకాశం

శనివారం । 14 । జనవరి । 2023

సంబరాల త్రయం

మూడు రోజుల ముచ్చటైన పండగ
ఆనందాల కలబోత మెండుగ
ధాన్యపు రాశులతో కళకళలాడగ
పిండి వంటల రుచి జిహ్వను తాకగ
భోగి పళ్లతో చిన్నారులు పరవశం..
సంక్రాంతితో చక్కెర పొంగలి మందహాసం
కనుమతో యంత్రాలు సిద్ధం
జిల్లా వ్యాప్తంగా పండగల ఆనందాలు
ఆరంభమయ్యాయి.



నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో భోగి మంట వేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికా గర్గ్, మేయర్ గంగాడ సుజాత తదితరులు

అవి తీరప్రాంత గ్రామాలు. ఎటు చూసినా పూదోటలు, పూల గుభాళింపులే. మదిని హత్తుకునే రకరకాల పువ్వులు, అవి వెదజల్లే పరిమళాలు మైమరిపిస్తాయి. మధురానుభూతినిచ్చే ఈ ప్రకృతి అందాలు.. అక్కడి ప్రజల జీవనాధారాలు. ఆ ఊర్లలో అన్ని పూల తోటలే. పెరటి పంటలు కూడా పూలే. ఆ గ్రామాల్లోకి వెళితే.. చిన్న, పెద్ద, ఆడ,మగ అందరూ కలిసి పూలు కోయడం, వాటిని బస్తాల్లో మూటలు కట్టడం, పట్టణాలకు ఎగమతి చేయడంలో బిజీబిజీగా కనిపిస్తారు. మరికొంత మంది ఇంటి పట్టున కూర్చొని దండలు కట్టడం చేస్తుంటారు. తెల్లవారింది మొదలు పొద్దుగూకే వరకు ఇదే పని. తెల్లవారు జామున వచ్చే మొదటి బస్సుకు ఒంగోలుకు వెళ్లి పూలు అమ్ముకొస్తారు కొందరు. మరి కొందరు సమీప గ్రామాల బాటపడతారు. అర్ధ శతాబ్దంగా వారికి ఇదే జీవనాధారం. కొత్తపట్నం మండలంలో వజ్జిరెడ్డిపాళెం, మడనూరు గ్రామాల్లోని అందరి ఇళ్లలో పూల సిరులు విరబూయిస్తున్నాయి.. ఇంకెందుకాలస్యం..వారి గుమ్మం తడదామా మరి.



వజ్జిరెడ్డిపాలెంలో పూలమాలలు కడుతూ బిజీబిజీగా..

- ఊర్లంతా పూల వనాలే
- ఇంటింటా పూలతోటలు
- ఇంటిల్లిపాదికీ చేతినిండా పనే..
- నిత్యం పూలు కోయటం, దండలుగా అల్లటం.. వాటిని విక్రయించడం..
- కొత్తపట్నం మండలం వజ్జిరెడ్డిపాలెం, మడనూరు గ్రామాల్లో పూలే ఉపాధికి మార్గాలు



ఆ ఊళ్లు.. పూదోటలు..

ఎన్.మాధవరెడ్డి
సాక్షి ప్రతినిధి, ఒంగోలు

నాలుగున్నర సెంట్లలో నాలుగు రకాల సాగు:



వజ్జిరెడ్డి పాలేనికి చెందిన కోటా సుబ్బారెడ్డికి ఇంటితో కలిపి 7 సెంట్ల స్థలం ఉంది. రెండున్నర సెంట్లలో ఇల్లు నిర్మించుకున్నాడు. ఇంటి చుట్టూ ఉన్న నాలుగున్నర సెంట్లలో నాలుగు రకాల పూలు సాగు చేస్తున్నాడు. ప్రధానంగా కనకాంబరాల సాగు ఉంది. దాంతో పాటు జాజిపూలు, తులసి ఆకు, లైన్ ఆకు సాగు చేస్తున్నాడు. వీటితో పాటు బయట నుంచి బంతి పూలు తెచ్చుకుంటాడు. కుటుంబ సభ్యులు అందరూ కలిసి పూలు కోయటం, అల్లుకోవటం చేస్తుంటారు. తెల్లవారు జామునే లేచి సుబ్బారెడ్డి ఇంట్లో కట్టిన పూలు తీసుకొని ఒంగోలు నగరంతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లి అమ్ముకొని వస్తాడు. సీజన్, అన్ సీజన్ అని తేడా లేకుండా ప్రతి రోజు రూ.500 తక్కువ కాకుండా సంపాదిస్తున్నాడు. తన కుటుంబం సంతోషంగా ముందుకు సాగిపోతోందని సుబ్బారెడ్డి ఆనందంగా చెబుతున్నాడు.

పూలతోనే జీవనం



నేను పుట్టినప్పటి నుంచి పూలతోనే జీవనం సాగిస్తున్నాం. నాకు పది సెంట్ల స్థలం, అరెకరా పొలం ఉంది. ఇంటి వద్ద, పొలంలోనూ పూలు సాగు చేస్తా. మరికొంత పొలంలో మిరప కూడా వేస్తాను. కానీ పూలే మా కుటుంబానికి జీవనాధారం. పిల్లలకు వివాహాలు చేశాం. నేను, నా భార్య ఇద్దరం కలిసి కనకాంబరాలు, బంతి, గులాబి, కదంబ ఆకు తోటలు సాగు చేస్తాం. విడిగా కొన్ని పూలు అమ్ముకుంటాం. ఇళ్లలో కట్టుకున్న పూలను మా ఇంటావిడ ఒంగోలుకు వెళ్లి అమ్ముకొని వస్తూ ఉంటుంది. మా జీవితం ఒడిదుడుకులు లేకుండా సాగిపోతోంది.

– ఆసోది సుబ్బరామిరెడ్డి,
వజ్జిరెడ్డి పాలెం గ్రామం

నేను మాలలు కడతా... మా అత్త అమ్ముకొస్తది



ఇంటి వద్ద ఉండి నేను పూల మాలలు కడతాను. మా అత్త ఒంగోలుకు వెళ్లి అమ్ముకొని వస్తుంది. మా పూలతోపాటు ఇతరుల పూలు కూడా కడుతుంటాను. బంతి పూలకు మూరకు రూ.1 ఇస్తారు. కనకాంబరం పూలకు మూరకు రూ.2 ఇస్తారు. రోజూ రూ.300 నుంచి రూ.500 వరకు కూలీ గిట్టుబాటు అవుతుంది. మా అత్త కూడా రోజుకు సరాసరిన రూ.500 పైగా సంపాదిస్తుంది. ప్రతిరోజూ పూలు కట్టడం, అల్లడం పనులు నిత్యం ఉంటాయి. ఇంటి పట్టునే ఉంటూ జీవనం సాగిస్తున్నాం.

– పిట్టు మనీష,
వజ్జిరెడ్డి పాలెం గ్రామం

పండగలు పబ్బాలనగానే అందరికీ గుర్తుకొచ్చేది, అవసరపడేది పువ్వులు. వ్రతాలు చేసుకునే వారికి, పెళ్లి చేసుకునే వారికి, అతిథి సత్కారాలు చేసే వారికి కావాల్సింది పూలదండలే. ఆడవాళ్ల మనసు దోచుకునేవి ఇవే ! తలలో పెట్టుకోవాలన్నా, దేవుడికి మాలగా అందించాలన్నా, పెళ్లిలో వరమాలగా కాబోయే శ్రీవారికి వేయాలన్నా పూల దండలనే కోరుకుంటారు. ఆ గ్రామాల్లో మాత్రం ప్రతి రోజూ పండుగ వాతావరణమే. ప్రతి రోజు పూలు తెచ్చుకోవటం, అల్లుకోవటం, దండలు కట్టుకోవటం జరుగుతూనే ఉంటుంది. ప్రతి లోగిలీ నిండుగా పూలతో గుభాళింపులే. ఎందుకంటే అది వారి జీవనోపాధి. కొత్తపట్నం మండలం వజ్జిరెడ్డిపాలెం, మడనూరు గ్రామాల్లో ప్రతి ఇంటిలో ఇదేతంతు. ఒక్కో గ్రామంలో 550 నుంచి 600 పైగా గడప ఉంటే వాళ్లలో 90 నుంచి 95 శాతం అందరూ పూలనే నమ్ముకొని జీవనాధారంగా కొనసాగిస్తున్నారు. ఈ రెండు గ్రామాలతోపాటు ఈతముక్కల, రాజుపాలెం, గమళ్లపాలెం గ్రామాల్లో కూడా కొంతమంది పూల ద్వారానే జీవనం సాగిస్తున్నారు.

పది సెంట్ల భూమి ఉన్నా పూల సాగే..

ఎకరాలకు ఎకరాల సాగు ఒక ఎత్తయితే, పది సెంట్ల భూమి ఉన్నా పూల సాగు చేపట్టడం ఇక్కడి రైతుల నైజం. ఎలాగూ పొలాల్లో సాగు చేయటం సర్వసాధారణం. ఇంటి చుట్టూ ఖాళీ స్థలం ఉంటే చాలు ఒకటి, రెండు రకాల పూలు కాదు పలు రకాలు పూలు మొక్కలు కనిపిస్తుంటాయి. సీజన్ల వారీగా ఇక్కడ పూలు పూయిస్తుంటారు. వేసవిలో మల్లెలు పూయిస్తారు. ఆ సీజన్ తప్ప మరే సీజన్‌లోనైనా అన్నిరకాల పూలు పూయించటం ఇక్కడి వారి ప్రత్యేకత. బంతి తోటలు మొదలుకొని కనకాంబరాలు, మందారాలు, కస్తూరి, నందివర్ధనాలు, జాజి, గులాబీ, సంతూరు, కాగడాలు, తులసి ఆకు, లైన్ ఆకు, మరువం ఇలా అన్ని తోటలను సాగు చేస్తారు.

ప్రతి ఒక్కరికీ ఉపాధి..

పూల సాగు చేసే ఆయా గ్రామాల్లో ఏ ఒక్కరూ ఖాళీగా ఉండరు. ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాలు మెండుగానే ఉంటాయి. ఎకరా, అరెకరా, పదిసెంట్లు ఉన్న వారి కుటుంబాల్లో అందరికీ చేతినిండా పనే. కోసిన పూలు ఇంటికి తీసుకొచ్చి వాటిని మాలలుగా తయారు చేసే సమయంలో ఇంట్లో ఉన్న అందరి చేతులూ పనిచేయాల్సిందే. ఆడ, మగా, చిన్నా పెద్దా, ముసలీ ముతకా అన్న తేడాలే ఉండవు. ఇంతెందుకు విద్యార్థులకు సెలవులు వస్తే వాళ్లు కూడా పూలు అల్లుతూనో...మాలలు కడుతూనో ఉంటారు. కుటుంబంలో ఒకరికి ఒకరు చేదోడు...వాదోడుగా పని చేస్తుంటారు.



బంతిమాలలు కడుతూ..

జిల్లా వ్యాప్తంగా అమ్మకాలు

వజ్జిరెడ్డిపాలెం, మడనూరు, ఈతముక్కల పూలకు జిల్లా వ్యాప్తంగా డిమాండ్ ఉంది. ఆయా గ్రామాల్లో ప్రతి ఇంటిలో కొందరు పగలంతా పూలు కోయటం, వాటిని మాలలు, దండలుగా కట్టడం, అల్లటం చేస్తుంటారు. అదే ఇంట్లోని ఒకరో, ఇద్దరో వాటిని తీసుకెళ్లి బయట గ్రామాల్లో విక్రయిస్తుంటారు. తెల్లవారు జామున మూడు గంటల నుంచే ఆర్టీసీ బస్సుల్లోనో, ఆటోల్లోనో ఆయా గ్రామాల నుంచి బయలు దేరుతారు. జిల్లా కేంద్రం ఒంగోలు చేరుకొని ఒంగోలు నగరంలోని కొత్తపట్నం బస్టాండ్ సెంటర్, గాంధీ రోడ్డు సెంటర్, పాత మార్కెట్ సెంటర్, కొత్త మార్కెట్ సెంటర్, కర్నూలు రోడ్డు ఇలా నగరంలోని ప్రధాన కూడళ్లలో పూలు అమ్మకాలు చేసుకొని మధ్యాహ్నానికో, సాయంత్రానికో ఇళ్లకు చేరుతారు. ఒంగోలుతో పాటు జిల్లాలోని పలు పట్టణాలు, మండల కేంద్రాలు, ఇతర గ్రామాలకు కూడా వెళ్లి పూలు అమ్ముకొని జీవనం సాగిస్తున్నారు.



బంతిపూల తోట





బంతి మాలలు, మందారపూలు కడుతున్న గ్రామస్తులు



కనకాంబరం తోట

వైభవంగా సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, వేదికపై మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్లు

- ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం
- సంప్రదాయ బద్ధంగా ముందస్తు సంక్రాంతి వేడుకల నిర్వహణ
- సంబరాల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని, కలెక్టర్, ఎస్పీ

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ముందస్తుగా సంక్రాంతి సంబరాలు వైభవంగా జరిగాయి. నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు అందరూ సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని అలరించారు. మహిళలు పోటీలు పడిమరీ తీర్చిదిద్దిన రంగవల్లులు అందరినీ ఆకట్టుకున్నాయి. కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ సంప్రదాయ దుస్తుల్లో సంబరాలకు హాజరయ్యారు. కలెక్టర్‌తో పాటు ఎస్పీ మలికాగర్గ్ కూడా పాల్గొన్నారు. కలెక్టర్, ఎస్పీలతో కలిసి నగర మేయర్ గంగాడ సుజాత భోగి మంటను ప్రారంభించి సంబరాలకు అంకురార్పణ చేశారు. అనంతరం భోగిపళ్ల పోయించి, పొంగళ్లను పొంగించారు. గంగిరెద్దుల ఆటలు, కోలాటం అందరినీ ఆకట్టుకున్నాయి. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రకరకాల పిండి వంటలు నోరూరించాయి.

మార్చి నాటికి అర్హులందరికీ ఇళ్ల పట్టాలు..

ముగింపు కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి పాల్గొని అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాలినేని సంబరాలను ఉద్దేశించి మాట్లాడారు. మొట్ట మొదటిసారిగా ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతి పథకంలోనూ మహిళలకు అగ్రస్థానం ఇస్తూ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. ఒంగోలు నగర పేదలకు సంక్రాంతి కానుకగా మార్చి నెలలో ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నామన్నారు. వాస్తవానికి గత సంవత్సరమే పట్టాలు ఇవ్వాల్సి ఉంటే టీడీపీ నాయకులు కోర్టుకు వెళ్లి అడ్డుపడ్డారన్నారు. ఏదిఏమైనా పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్న సదుద్దేశంతోనే సీఎం వైఎస్ జగన్ పట్టాల ఇవ్వటానికి భూముల కొనుగోలుకు రూ.200 కోట్లు కేటాయించారని చెప్పారు. భూముల కొనుగోలుకు రెవెన్యూ అధికారులు ముమ్మరంగా కసరత్తు చేపట్టారని వివరించారు. దాదాపు 25 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వటానికి సీఎం వైఎస్ జగన్ ఒంగోలుకు రానున్నట్లు కూడా బాలినేని వెల్లడించారు. అదేవిధంగా గతంలో సీఎం వైఎస్ జగన్ ఒంగోలు వచ్చినప్పుడు నగర ప్రజల మంచినీటి అవసరాలు తీర్చేందుకు మంజూరు చేసిన రూ.350 కోట్లకు సంబంధించి డ్రాఫ్ట్ జీఓ తయారైందన్నారు. సంక్రాంతి పండుగ తరువాత జీఓ విడుదలవుతుందని భరోసా ఇచ్చారు.

కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ మాట్లాడుతూ మన జీవన శైలితో ముడిపడిన సంప్రదాయ పండుగ సంక్రాంతి అని గుర్తు చేశారు. జిల్లాలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో పండుగ జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్పీ మలికాగర్గ్ మాట్లాడుతూ పాత ఆలోచనలు, దుఃఖాన్ని వదిలివేసి సరికొత్త ఆశలు, ఆకాంక్షలకు ప్రతీకగా సంక్రాంతిని జరుపుకుంటామని వెల్లడించారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ మనిషిని ప్రకృతితోనూ, వ్యవసాయంతోనూ అనుసంధానం చేసే అతిపెద్ద పండుగ సంక్రాంతి అని గుర్తు చేశారు. చిన్నారులతో కలిసి మేయర్ కూడా నృత్యాలు చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.



సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులతో కలసి డాన్స్ వేస్తున్న మేయర్ గంగాడ సుజాత



ముగ్గులను తిలకిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్, మేయర్ గంగాడ సుజాత

క్లుప్తంగా

రేపటి నుంచి రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

కొత్తపట్నం: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రస్థాయి న్యూ కేటగిరి ఎడ్ల బండలాగుడు పోటీలు ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సహకారంతో, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి సారథ్యంలో పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.50 వేలు, మూడవ బహుమతి రూ.40 వేలు, నాల్గవ బహుమతి రూ.30 వేలు, ఐదో బహుమతి రూ.20 వేలు, ఆరవ బహుమతి రూ.15 వేలు, ఏడో బహుమతి రూ.12 వేలు, 8వ బహుమతి రూ.10 వేలు, 9వ బహుమతి రూ.8 వేలు ప్రదానం చేస్తామన్నారు. 16వ తేదీ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 7708169765, 9866729559 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఈవీఎంలకు పటిష్టమైన భద్రత

ఒంగోలు అర్బన్: ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లు ఉన్న గోడౌన్‌కు పటిష్టమైన భద్రత కల్పిస్తున్నామని కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం గోదామును శుక్రవారం త్రైమాసిక తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన తీరును పరిశీలించారు. యంత్రాలకు ఎటువంటి డ్యామేజి కలగకుండా జాగ్రత్తలు వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. దీనిలో కలెక్టర్ వెంట పలువురు అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.





నువ్వా..నేనా సై..

సంక్రాంతి అనగానే ముగ్గుల పోటీలే కాదు.. ఎడ్ల బండలాగుడు, పొట్టేళ్ల పందేలు, కోడి పందేలు పల్లెలకు మరింత శోభను తీసుకువస్తాయి. ఈ మూడు రోజుల పాటు పిల్లా, పెద్దా తేడా లేకుండా ఒళ్లంతా కళ్లు చేసుకొని ఈ పోటీలను తిలకిస్తారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో జరిగిన పోటీల్లోని చిత్రాలు.

ఫొటోలు: ఎం ప్రసాద్

సిబ్బంది సంక్షేమానికే మొదటి ప్రాధాన్యం

● ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: పోలీసు సిబ్బంది సంక్షేమానికి మొదటి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎస్పీ మలికా గర్గ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీసు గ్రీవెన్స్ డే నిర్వహించారు. జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్ల నుంచి వచ్చిన సిబ్బందితో ఎస్పీ మాట్లాడారు. విధి నిర్వహణలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సస్పెండ్ నుంచి రిలీవ్ వరకు, బదిలీలకు సంబంధించిన సమస్యలను పలువురు పోలీసులు, హోంగార్డులు ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు.



పోలీసు సంక్షేమ దివస్‌లో ఎస్పీ మలికా గర్గ్

సిబ్బంది ఇబ్బందులను తెలుసుకుని వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలీసు గ్రీవెన్స్‌లో తమ సమస్యలను వివరిస్తే సత్వరం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే పోలీసులు, హోంగార్డులు సమస్యలతో కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితులు ఉండరాదనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న పోలీసు సంక్షేమ దివస్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ కేవీ రాఘవేంద్రరావు, ఎస్ఐలు, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

ధనాధన్ టోర్నీకి వేళాయె..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం

SAKSHI
SAKSHI DIGITAL MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

Regional sponsor

APMDC APMDC FOUNDATION

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్లు వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్‌గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

సెల్: 9010357744, 9912671555

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

కర్ణాటక మద్యం స్వాధీనం

● అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన సెబ్ అధికారులు

కందుకూరు: కర్ణాటక నుంచి అక్రమ మార్గంలో మద్యం తీసుకొచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సెబ్ సీఐ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక సెబ్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని కొండముడుసుపాలెం గ్రామానికి చెందిన ముప్పా రవితేజ అనే యువకుడు కొంత కాలంగా కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్నాడు. గ్రామంలోనే మద్యం నిల్వ ఉంచి గుట్టుచప్పుడు కాకుండా అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో సమాచారం రావడంతో గురువారం రాత్రి కొండముడుసుపాలెంలో దాడులు నిర్వహించి అక్రమ మద్యంతో పాటు ముప్పా రవితేజను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అతని వద్ద నుంచి 11 రకాల బ్రాండ్‌లకు చెందిన 48 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ దాదాపు రూ.1.40లక్షలు ఉంటుందని వివరించారు. అలాగే పట్టణంలో గంజాయి విక్రయాలపై కూడా నిఘా ఉంచామన్నారు. పలు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నట్లు తమకు సమాచారం ఉందని, త్వరలోనే వారిని అదుపులోకి తీసుకుంటామని తెలిపారు. మత్తు పదార్థాల హానీ గురించి యువతలో చైతన్యం తీసుకువచ్చేందుకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. సెబ్ ఎస్సై మౌలాలి తదితరులు పాల్గొన్నారు.



సెబ్ అధికారులు స్వాదీనం చేసుకున్న అక్రమ మద్యం

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

● రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

పుల్లలచెరువు: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని పురపాలక శాఖమంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. పుల్లలచెరువు మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి పార్టీ కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 24 రకాల పథకాలను ప్రవేశపెట్టి కుల, మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా సంక్షేమమే ధ్యేయంగా జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో 175 సీట్లను వైఎస్సార్ సీపీకి కట్టబెట్టేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం చూసి ఓర్వలేక ప్రతిపక్ష నేతలు ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేస్తున్నారని, వాటిని నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. ప్రభుత్వం నూతనంగా సచివాలయ కన్వీనర్ల, గృహ సారథులు వైఎస్సార్ సీపీకి కళ్లు లాంటి వారని, రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి జగనన్నను మరోసారి సీఎం చేసేందుకు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో పనిచేస్తున్న వలంటీర్లు, కన్వీనర్ల, గ్రామ సారథులు సమన్వయంతో పనిచేస్తూ అర్హులకు సంక్షేమ ఫలాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి, ఎంపీపీ మందాలాజర్, జెడ్పీటీసీ వాగ్యానాయక్, జిల్లా కమిటీ సభ్యుడు కోటిరెడ్డి, సర్పంచ్‌లు సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్వరనాయక్, నాయకులు రఘు, శ్రీకాంత్‌రెడ్డి, కాశయ్య పాల్గొన్నారు.



హాజరైన సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు

నేటి నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

కొనకనమిట్ల: సంక్రాంతిని పురస్కరించుకొని మండలంలోని గొట్లగట్టులో శనివారం నుంచి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు ప్రారంభించనున్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో జిల్లా నుంచి మొత్తం 30 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన క్రీడా జట్లకు మొదటి బహుమతి రూ.30 వేలను మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి, రెండవ బహుమతి రూ.25 వేలను మండల వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, మూడో బహుమతి రూ.20 వేలను ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, నాల్గవ బహుమతి రూ.15 వేలను యూత్ నాయకుడు పల్లపాటి కాంతరావు, ఐదో బహుమతి రూ.10 వేలను మాజీ సర్పంచ్ నాగం బాలగురవయ్య, ఆరో బహుమతి రూ.5 వేలను యూత్ నాయకుడు మూరంరెడ్డి వెంకటస్వామిరెడ్డి ఇవ్వనున్నారు.

ఉత్సాహభరితంగా జాతీయస్థాయి ఎడ్ల పోటీలు




పోలురాధ పోటీల్లో పాల్గొన్న ఎడ్ల జత

పర్చూరు: జాతీయస్థాయి ఒంగోలు జాతి గిత్తల బలప్రదర్శన పోటీలు శుక్రవారం ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. మండలంలోని అన్నంభొట్లవారిపాలెం గ్రామంలో గోరంట్ల రత్తయ్య చౌదరి ప్రాంగణంలో పోటీలు నిర్వహిస్తున్నారు. పోలురాధ జూనియర్స్ విభాగంలో మొత్తం 22 జతలు పాల్గొనగా బాపట్ల జిల్లా సుబ్బారెడ్డిపాలేనికి చెందిన సుబ్బారెడ్డి ఎడ్ల జత నిర్ణీత సమయంలో 2,559.1 అడుగుల దూరం లాగి మొదటి బహుమతి గెల్చుకుంది. చీరాల మండలం, పాత చీరాలకు చెందిన ఎస్ఎస్ రెడ్డి బుల్స్ ఎడ్ల జత 2503 అడుగుల దూరం లాగి ద్వితీయ బహుమతి, బాపట్ల జిల్లా సీతానగరానికి చెందిన ముద్దనబోయిన నాగశాంతి ఎడ్ల జత 2400 అడుగుల దూరం లాగి తృతీయ బహుమతి గెల్చుకుంది. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం ఊళ్లపాలెం , కొత్తపాలేనికి చెందిన మున్నం రుద్రమహేందర్‌రెడ్డి, కూనపురెడ్డి వెంకటసుబ్బయ్య ఎడ్ల జతలు సంయుక్తంగా 2399.9 అడుగుల దూరం లాగి నాలుగో బహుమతిని గెల్చుకున్నాయి. చీరాలకు చెందిన గంజి హేమంత్ ఎడ్లజత 2378.9 అడుగుల దూరం లాగి ఐదో బహుమతిని గెల్చుకుంది. అలాగే వేటపాలేనికి చెందిన దేవరపల్లి జాన్వికారెడ్డి ఎడ్లజత 2348 .9 అడుగుల దూరం లాగి ఆరో బహుమతి గెల్చుకుంది. కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం కొత్తమాజేరుకు చెందిన తుమ్మల కోటయ్య మెమోరియల్ ఎడ్లు 2337.9 అడుగుల దూరం లాగి ఏడో స్థానంలో నిలిచాయి. అలాగే బాపట్ల జిల్లా కొత్తపాలేనికి చెందిన కావూరి వెంకటేశ్వరరెడ్డి ఎడ్ల జత 2325.2 అడుగుల దూరం లాగి ఎనిమిదో బహుమతిని గెల్చుకుంది. కారంచేడు మండలం, ఆదిపూడికి చెందిన జైబాబు చెందిన ఎడ్లజత 2244.7 అడుగుల దూరం లాగి తొమ్మిదో బహుమతిని గెల్చుకున్నాయి. శుక్రవారం పోలురాధ సీనియర్స్ విభాగంలో పోటీలు జరుగుతున్నాయని నిర్వాహకులు కొనకంచి సుబ్బారావు తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

కొమరోలు: మండలంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులను శుక్రవారం అభినందించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఒంగోలు మున్సిపల్ హైస్కూలులో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలో పాఠశాలకు చెందిన అండర్–17 విభాగంలో షాట్‌పుట్ విభాగంలో ఎడమకంటి వెన్నెల ప్రథమస్థానంలో నిలువగా, కొమరోలు నరేంద్ర లాంగ్‌జంప్‌లో ప్రథమస్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయస్థానంలో నిలిచినట్లుగా వ్యాయామ ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్ తెలిపారు. వెంకటరామజశ్వంత్ 800 మీటర్ల పరుగు పందెంలో ప్రథమస్థానంలో నిలువగా 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచాడని, అండర్–14 విభాగంలో ఎడమకంటి వైష్ణవి షాట్‌పుట్ విభాగంలో ప్రథమస్థానంలో, విజయేంద్రనాయుడు డిస్కస్‌త్రోలో ప్రథమస్థానంలో నిలిచినట్లు తెలిపారు. వీరు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలో పాల్గొంటారని తెలిపారు. వీరిని తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ శ్రవంతి, వ్యాయామ ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

అనాథలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న మహబూబ్

ఒంగోలు: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని నిరాశ్రయులకు రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మహబూబ్ శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. పాత మార్కెట్ వద్ద ఉన్న తన ఎస్‌ఎంఎస్ ఫ్రూట్స్ షాపు వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ మహబూబ్ మాట్లాడుతూ సంక్రాంతి సమయంలో పెరుగుతున్న చలి నుంచి రోడ్లపై నిరాశ్రయులై జీవిస్తున్న అనాథలకు రక్షణ కల్పించేందుకు పదేళ్లుగా దుప్పట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, రచయిత డాక్టర్ మొగిలి దేవ మాట్లాడుతూ సేవా దృక్పథాన్ని నిర్వహిస్తున్న మహబూబ్‌బాషా సేవలను కొనియాడారు. శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి, అల్లాభక్షు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు అందుకుంటున్న యువతి

ఒంగోలు అర్బన్: సూర్యశ్రీ దివ్యాంగుల ట్రస్టు ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ సందర్భంగా ఐటీ స్మార్ట్ ఐఎంఎస్ సహకారంతో నగరంలో శుక్రవారం పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. రూ.లక్ష 13 వేల విలువైన 10 కేజీల బియ్యం, కందిపప్పు, నూనె, బెల్లం తదితర వస్తువులు పేదలకు పంపిణీ చేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న వసతి గృహాల్లోని దివ్యాంగులకు రూ.45 వేల విలువైన నూతన దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఐటీ స్మార్ట్ కంపెనీ డైరెక్టర్ రవి, ట్రస్ట్ సభ్యులు మండవ మురళీకృష్ణ, సహనాజ్‌బేగం, సర్దార్‌బాషా, మారెళ్ల సుబ్బారావు, మండవ సుబ్బారావు, నేరెళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు వర్క్ అడ్జస్ట్‌మెంట్ కౌన్సెలింగ్

ఒంగోలు: వర్క్ అడ్జస్ట్‌మెంట్ కోసం ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ కార్యక్రమం స్థానిక డీఆర్‌ఆర్‌ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు డీఈవో బి.విజయభాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్‌ప్లస్‌లో ఉన్న స్కూల్ అసిస్టెంట్స్, సబ్జక్టుకు కన్వర్షన్ ఇచ్చిన ఉపాధ్యాయులు, 2022 అక్టోబరులో జరిగిన పదోన్నతుల ప్రక్రియలో విల్లింగ్ ఇచ్చిన సెకండరీ గ్రేడ్, తత్సమాన ఉపాధ్యాయులు హాజరు కావాలన్నారు. అయితే ఈ మూడు విభాగాల్లో ఇంతకు మునుపే వర్క్ అడ్జస్ట్‌మెంట్ ఉత్తర్వులు పొందిన ఉపాధ్యాయులు హాజరుకావాల్సిన అవసరం లేదన్నారు. అదే విధంగా హైస్కూలు ప్లస్ 2 కు ఇంతకుమునుపే వర్క్ అడ్జస్ట్‌మెంట్ ఉత్తర్వులు పొందిన వారు హాజరుకావాల్సిన అవసరం లేదన్నారు. దీనికి సంబంధించిన జాబితాను అన్ని ఉపాధ్యాయ సంఘాలకు అందజేశామని, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలోని నోటీసు బోర్డులో, డీఈవోప్రకాశం.కో.ఇన్ వెబ్‌సైట్‌లో కూడా ఉంచారన్నారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని డీఈవో బి.విజయభాస్కర్ ఆదేశించారు.

సీహెచ్‌సీ గ్రూపులకు యంత్రాలు అందించాలి



మాట్లాడుతున్న బెజవాడ రాముతో ఏఓ రమేష్

మద్దిపాడు: సీహెచ్‌సీ గ్రూపు సభ్యులకు ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు అందించాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెజవాడ రాము సూచించారు. శుక్రవారం మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో నిర్వహించి మండల వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. సబ్సిడీ శనగలు ఎకరాకు ఇచ్చే మోతాదు పెంచాలని, వ్యక్తిగతంగా రైతులకు వ్యవసాయ పరికరాలు అందించాలని కోరారు. ఇటీవల సబ్సిడీపై మందులు చల్లుకోవడానికి డ్రోన్లు వస్తున్నాయని, వాటిని మండలానికి కూడా తెప్పించాలన్నారు. వ్యవసాయశాఖాధికారి కె. రమేష్ మాట్లాడుతూ డ్రోన్లు మండలానికి మూడు ఇచ్చారని, రైతులు గ్రూపులుగా ఏర్పడితే వారికి మంజూరు చేస్తామని తెలిపారు. రబీలో సాగు చేసిన ప్రతి పంటను వీఏఏల ద్వారా ఈ-క్రాప్ చేయించుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఏఈఓ పి. శేషయ్య పాల్గొన్నారు.

పేకాట శిబిరాలపై దాడులు

కొత్తపట్నం: పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు చేశారు. మండలంలోని ఈతముక్కల గ్రామ శివారులో శుక్రవారం పేకాట ఆడుతున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ కొక్కిలగడ్డ మధుసూదన్‌రావు తన సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. శిబిరంలో రూ.1,850 నగదు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అదుపులో తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. జూదరులను కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అభివృద్ధిలో ఆదర్శం.. గద్దలగుంట

- 21 ఏళ్లుగా అద్భుత ప్రగతి
- దేశవిదేశాలకు వెళ్లిన వారు సైతం స్వగ్రామానికి రాక
- ముచ్చటగా మూడు రోజులు జరిగే కార్యక్రమానికి ప్రతి ఒక్కరికీ ఆహ్వానం
- వివరాలు వెల్లడించిన 32వ డివిజన్ కార్పొరేటర్ తాడి కృష్ణలత



విలేకరులతో మాట్లాడుతున్న గద్దలగుంట అభివృద్ధి కమిటీ సభ్యులు

ఒంగోలు: అభివృద్ధిలో గద్దలగుంట ఆదర్శమని 32వ డివిజన్ కార్పొరేటర్ తాడి కృష్ణలత అన్నారు. శుక్రవారం స్థానిక గద్దలగుంటలోని నెహ్రూ బొమ్మ సెంటర్‌లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం గద్దలగుంట పార్కులో సంక్రాంతి సంబరాలకు సంబంధించిన బ్రోచర్లను గద్దల గుంట గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాడి కృష్ణలత మాట్లాడుతూ 21 ఏళ్ల క్రితం గద్దలగుంట అభివృద్ధి కమిటీని కొల్లా పుల్లయ్య ప్రారంభించారని గుర్తు చేశారు. కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వం, గ్రామస్తులు సంయుక్తంగా గ్రామంలో రోడ్లు, ఆరామ క్షేత్రం, శ్మశాన వాటిక, చక్కని పార్కు వంటివి అనేకం ఏర్పాటు చేసుకున్నామన్నారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా విదేశాలకు వెళ్లిన వారు, ఇతర రాష్ట్రాల్లో నివాసం ఉండేవారు సైతం తమ గ్రామానికి విచ్చేసి పెద్దలు, స్నేహితులతో సరదాగా ఉంటూ పండగ సంబరాల్లో పాల్గొంటున్న తీరు ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కమిటీ ప్రధాన కార్యదర్శి ఓగిరాల రాధాకృష్ణ మాట్లాడుతూ తమ కమిటీ ప్రధాన కార్యదర్శి ఒకరు మున్సిపల్ అంబాసిడర్‌గా ప్రభుత్వం గుర్తించిందంటే తమ గ్రామంలో జరిగిన అభివృద్ధిని అంచనా వేయవచ్చన్నారు. ఆరామ క్షేత్రానికి స్థానిక శాసనసభ్యుడు రూ.15 లక్షలు మంజూరు చేయిస్తే తమ గ్రామ సభ్యులు మరో రూ.25 లక్షలు వెచ్చించి అద్భుతంగా నిర్మించుకోగలిగామన్నారు.



ముగ్గుల పోటీలను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ తాడి కృష్ణలత

కొల్లా మధు మాట్లాడుతూ తమ గ్రామంలో ఒక ఫంక్షన్ హాలు ఉండాలన్న ఆకాంక్ష కూడా త్వరలోనే నెరవేరాలని కోరుకుంటున్నామన్నారు. కమిటీ ప్రధాన కార్యదర్శి ఆరిగ శ్రీనివాసరావు మాట్లాడుతూ కరోనా సమయంలో ఆరామ క్షేత్రంవిలువ ఏమిటో తెలిసిందని, అందులో అత్యవసరమైన సమయంలో నాలుగు కుటుంబాలు ఉండేలా గదుల నిర్మించామని, త్వరలోనే శాసనసభ్యుడు బాలినేని శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించుకోనున్నట్లు పేర్కొన్నారు. ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానం చైర్మన్ ఈదుపల్లి గురునాథం మాట్లాడుతూ మూడు రోజుల పాటు ముచ్చటగా 12 రకాల పోటీలు (పరుగుపందెం, స్లో సైక్లింగ్, మ్యూజికల్ చైర్స్, పాటల పోటీలు, షటిల్, డ్యాన్స్ పోటీలు, డ్రాయింగ్, స్కిప్పింగ్, వ్యకృత్వ, క్రికెట్, బాల్ అండ్ బక్కెట్, ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని, వాటిలో విజేతలకు స్థానిక శాసనసభ్యుడు బాలినేని శ్రీనివాసరెడ్డి లక్ష రూపాయల విలువైన బహుమతులు అందిస్తున్నారన్నారు. పోటీలు శని, ఆదివారాల్లో ఉదయం 9.15 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో గద్దలగుంట గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కుర్రా ప్రసాద్‌బాబు, అడ్వకేట్ చిట్టెం వెంకటేశ్వర్లు, కాటా నాగేశ్వరరావు, ఈదుపల్లి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం బాలినేని శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా బహుమతి ప్రదానం జరుగుతుందని, అదే విధంగా 16వ తేదీ పారువేట కార్యక్రమానికి వేదిక అయిన తమ గ్రామానికి ప్రజలు మిక్కిలిగా తరలివచ్చి దేవతామూర్తులను దర్శించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలైన గంగిశెట్టి సాయిలక్ష్మి (ప్రథమ–రూ.10 వేలు), వెంకటలక్ష్మి (ద్వితీయ– రూ.5 వేలు), బాల అనంత లక్ష్మి(తృతీయ–రూ.3 వేలు) నగదు బహుమతులు ప్రకటించారు.

తిరుప్పావై కార్యక్రమంలో పాల్గొన్న బాలినేని



ఓం శ్రీహరి భక్త బృందంతో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: స్థానిక గద్దలగుంటలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో జరిగిన తిరుప్పావై కార్యక్రమానికి మాజీ మంత్రి, శాసనసభ్యుడు బాలినేని శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసన్నాంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. తిరుప్పావై కార్యక్రమంలో పాల్గొని ఓం శ్రీహరి పారాయణ భక్త బృందం సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. స్వామివారి వేడుకల్లో పాల్గొని సేవలందించిన 200 మంది భక్త బృందానికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమం ఈదుపల్లి దశరథరామారావు, రేణుకాదేవి ఆధ్వర్యంలో జరగ్గా 32వ డివిజన్ కార్పొరేటర్ తాడి కృష్ణలత, 30వ డివిజన్ కార్పొరేటర్ షేక్ ఫాతిమాబీ, 33వ డివిజన్ కార్పొరేటర్ పెద్దిరెడ్డి నియంతకుమారి, 30వ డివిజన్ కార్పొరేటర్ కాశీమహంతి చంద్రకళ, 48వ డివిజన్ కార్పొరేటర్ వేమూరి భవాని, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కటారి శంకర్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంటా రామానాయుడు ఉన్నారు.

నేడు బాలినేని కార్యక్రమాలు

ఒంగోలు: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్, స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి శనివారం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని ఆయన కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఉదయం 5 గంటలకు స్థానిక సీవీఎన్ క్లబ్‌లో జరిగే భోగి మంటల్లో పాల్గొంటారు. 5.20 గంటలకు స్థానిక లాయరుపేట సాయిబాబా ఆలయం వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగే భోగి సంబరాల్లో పాల్గొంటారు. ఉదయం 11 గంటలకు అతిథి రెస్టారెంట్ ప్రారంభోత్సవం, 11.30 గంటలకు కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామంలోని దాచూరి గోపాల్‌రెడ్డి నివాసానికి వెళ్తారు. 12 గంటలకు స్థానిక పప్పు బజారులో గోదాదేవి కల్యాణ మహోత్సవంలో, మధ్యాహ్నం ఒంటి గంటకు ఒంగోలు రూరల్ మండలం ఉలిచిలో పార్టీ కార్యకర్త దశదిన కార్యక్రమానికి హాజరవుతారు.

పొగాకు రైతుల అసంతృప్తి

మద్దిపాడు: ఇటీవల సంభవించిన మాండూస్ తుఫాన్ కారణంగా నష్టపోయిన పొగాకు రైతులు తమకు బోర్డు ఇస్తున్న సాయంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పొగాకు రైతులకు సంబంధించిన విషయంలో జరిమానాలు వసూలు చేస్తూ వందల కోట్ల రూపాయలు పోగు చేసుకున్న పొగాకు బోర్డు ప్రస్తుతం రైతులకు సహాయ నిధి నుంచి కేవలం 10 వేల రూపాయలు వడ్డీ లేకుండా ఇచ్చి రెండు నెలల్లోనే తిరిగి కట్టాలని నిర్ణయించడం రైతులకు సాయం చేసినట్లు కాదంటున్నారు. కేవలం రెండు నెలలకు పొగాకు బోర్డు చేస్తున్న సాయం కేవలం 150 రూపాయలు మాత్రమే అంటూ పెదవి విరుస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో పని చేస్తున్న పొగాకు బోర్డు తమ రైతులకు ఏం మేలు చేసినట్లు.. అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ప్రతి కేజీకి డీలర్ల వద్ద రూపాయి, రైతుల వద్ద రూపాయి వసూలు చేస్తూ కోట్లాది రూపాయలు జమ చేసుకుంటూ రైతులకు మొండిచెయ్యి చూపడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు ఆసరాగా రాష్ట్ర ప్రభుత్వం

పొగాకు రైతులకు హెక్టార్‌కు 10 వేల రూపాయలు చొప్పున రెండు హెక్టార్లకు 20 వేల రూపాయలు నష్ట పరిహారం ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బోర్డు పరిధిలోని రైతులకే కాకుండా బర్లీ పొగాకు వేసిన రైతులకు కూడా మేలు జరిగే విధంగా నిర్ణయం తీసుకుంది. శనగ రైతులకు 80 శాతం సబ్సిడీపై తుఫాన్ వెళ్లిన వారం రోజుల్లోనే శనగ విత్తనాలు అందించారు. మిగిలిన పంటలకు సంబంధించిన నష్టపరిహారాన్ని రైతులకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. గత సంవత్సరంలో మిర్చి రైతులకు ఆర్‌బీకేల ద్వారా క్రాప్ ఇన్స్యూ చేయించడంతో గత సంవత్సరం రైతులు నష్టపోకుండా బయటపడ్డారు. ఇదే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఆసరాగా నిలుస్తూ నిర్ణయం తీసుకోవడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

మెడికల్ ఎంప్లాయీస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ క్యాలెండర్‌ను కలెక్టర్ దినేష్‌కుమార్ శుక్రవారం ప్రకాశభవనంలో ఆవిష్కరించారు. ఎంప్లాయీస్ సంక్షేమానికి యూనియన్ కృషి చేయలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మిడసల బ్రహ్మానాయుడు, సూర్యనారాయణ, ప్రసాదరావు, శ్రీనివాసరావు, విజయరాజు పాల్గొన్నారు.

స్కీం వర్కర్ల సమస్యపై గళం వినిపించాలి

ఒంగోలు: స్కీమ్ వర్కర్ల సమస్యపై పార్లమెంట్లో గళం వినిపించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కార్యాలయంలో సిబ్బందికి శుక్రవారం అందించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ 45వ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసు మేరకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలంటూ పలు సూచనలు చేశారో వాటిని అమలు చేసేందుకు పార్లమెంట్‌లో ఎంపీ గళం వినిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంచాల కల్పన పాల్గొన్నారు.

గృహాలు వేగంగా నిర్మించాలి



నిడమానూరు కాలనీని పరిశీలిస్తున్న అధికారులు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఈ నారాయణరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి

ఒంగోలు రూరల్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని, వెంటనే ఇళ్లు నిర్మించుకోకుంటే నివేశన స్థలాలు వెనక్కు తీసుకునేందుకు కూడా వెనకాడేది లేదని హౌసింగ్ డీఈ నారాయణరెడ్డి అన్నారు. కరవదిలో ఉన్న ఐదు జగనన్న లేఔట్లను శుక్రవారం ఆయన నిశితంగా పరిశీలించారు. తొలుత రెడ్డిపాలెం, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీల లేఔట్లను పరిశీలించారు. ఒంగోలు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఈవోఆర్డీ పూర్ణచంద్రరావు, హౌసింగ్ ఏఈ పృధ్వీలతో కలిసి సంబంధిత లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. రోడ్లు, నీటి కుళాయిల ఏర్పాటు కోసం పైపు లైన్ల వసతి, విద్యుదీకరణ తదితర మౌలిక సదుపాయాల కల్పన కోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. గృహాలు లేని నిరుపేదలకు గృహ వసతి కల్పించేందుకే ఇళ్ల పట్టాలు రెండేళ్ల క్రితం రాజకీయ పార్టీలకు అతీతంగా ఇచ్చినట్లు చెప్పారు. కొందరు పునాదులు కూడా తీయకపోవడం శోచనీయమన్నారు. ఒంగోలు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ లబ్ధిదారులు గృహాలు నిర్మించకుండా మీనమేషాలు లెక్కించడం భావ్యం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం పేదలందరికీ ఇళ్లు నిర్మించడమేనని గుర్తించుకోవాలన్నారు. ఈవోఆర్డీ పూర్ణచంద్రరావు, హౌసింగ్ ఏఈ పృథ్వీ మాట్లాడారు. ఆయా కాలనీల లబ్ధిదారులు, కార్యదర్శి వేమా శ్రీలక్ష్మి, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు మణికంఠ, రమీజ్, సర్పంచ్ డి. కోటేశ్వరరావు, ఎంపీటీసీ మన్నే శ్రీనివాసరావు, కోమలి పాల్గొన్నారు.

జగనన్న కాలనీల నిర్మాణం వేగవతం చేయాలి

నాగులుప్పలపాడు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి అంజల కోరారు. శుక్రవారం మండలంలోని నిడమానూరులో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన ఆమె అధికారులు, లబ్ధిదారులతో మాట్లాడారు. లబ్ధిదారులకు అవసరమైన మెటీరియల్ త్వరితగతిన అందజేయాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్ వడ్డిముక్కల శ్రీనివాసరావు, తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీవో వేణుకుమారి, హౌసింగ్ ఏఈ సూర్యభగవాన్, ఏపీఎం రవి ఉన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఆహ్వానం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

చీమకుర్తి: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ సందర్భంగా ఈ నెల 15, 16వ తేదీల్లో చీమకుర్తిలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గొల్లపూడి కోటేశ్వరరావు, మార్తల తిరుపతిరెడ్డి తెలిపారు. శుక్రవారం చీమకుర్తిలో కబడ్డీ పోటీలకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ జిల్లాలో ప్రతిభ కలిగిన కబడ్డీ క్రీడాకారులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. స్త్రీ, పురుషుల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు చెరుకూరి రఘుకిరణ్, సభ్యులు మన్నం నాగరాజు, పి.తిరువెంగళం, పోకూరి రామకృష్ణారెడ్డి, వీరారెడ్డి, వెంకట్రావు, స్థానికులు పాల్గొన్నారు.

తిరుమంజన సేవలో మాజీ మంత్రి శిద్దా



పూజ చేస్తున్న శిద్దా రాఘవరావు దంపతులు

చీమకుర్తి: ధనుర్మాస వ్రత మహోత్సవంలో భాగంగా శుక్రవారం అగ్రహారంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన తిరుమంజన సేవలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతి దంపతులు పాల్గొన్నారు. గత నెల 16వ తేదీ నుంచి ఈ నెల 15 వరకు గోదాదేవి తిరుప్పావై వ్రత మహోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా శుక్రవారం శిద్దా రాఘవరావు దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు అందించి విశేష పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



శర్మ కళాశాలలో ఒక చోట చేరిన పూర్వ విద్యార్థులు

ఒంగోలు టౌన్: అరేయ్ సుబ్బారావు ఎలా ఉన్నావు..? ఒరేయ్ లక్ష్మీరెడ్డి పిల్లలు ఏం చేస్తున్నారు..? హాయ్ సుజాత పూర్తిగా మారిపోయావే..? ఇది సీఎస్‌ఆర్ కళాశాలలో శుక్రవారం కనిపించిన దృశ్యం. వారంతా 1984–87లో సీఎస్‌ఆర్ శర్మ కాలేజీలో చదువుకున్న విద్యార్థులు. ఎక్కడో పుట్టి..ఎక్కడో పెరిగి.. చదువులమ్మ ఒడిలో ఒక్కటైన వీరంతా ఇప్పుడు ఎక్కడెక్కడో నివశిస్తున్నారు. జీవిత పయనంలో రెక్కలొచ్చిన పక్షుల్లా ఎగిరిపోయి బతుకుదెరువులో పరుగులు పెడుతున్నారు. కాస్త తీరిక దొరికినప్పుడు మాత్రం బాల్యంలోకి వెళ్లిపోయి చిన్ననాటి స్నేహితులను పలకరించి జ్ఞాపకాలు నెమరవేసుకున్నారు. ఎలాగైనా సరే ఒక్కసారి తీరిక చేసుకొని కలిసి మాట్లాడుకోవాలనే తపనతో వారంతా 35 ఏళ్ల క్రితం ఒంగోలులో తాము చదువుకున్న సీఎస్‌ఆర్ శర్మ కళాశాలకు చేరుకొని మనసారా పలకరించుకున్నారు. అరేయ్.. ఒరేయ్ అంటూ ఆప్యాయంగా కబుర్లు చెప్పుకున్నారు. కుశల సమాచారాలు చెప్పుకొని భావోద్వేగాలకు గురయ్యారు. తరగతి గదులకు వెళ్లి ఆనాడు తాము కూర్చున్న బెంచీలపై కూర్చొని గతాన్ని నెమరవేసుకున్నారు. చేసిన అల్లరిని గుర్తుచేసుకొన్నారు. నేను ఎప్పుడూ చెబుతుంటానే...వేమూరి బుజ్జి అంటే ఇతడే.. క్లాసు రూమ్‌లో భలే జోకులు వేసే వాడులే.. అంటూ తమ కుటుంబ సభ్యులను ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి హోటల్ సరోవర్‌కు చేరుకున్నారు. విందు వినోదాలతో సందడి చేశారు. సన్మానాలతో హడావుడి చేశారు. ఎస్. చంద్రశేఖర్, కోలా ప్రభాకర్, ఎన్నారై శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ గుప్త తదితరులు నిర్వాహకులుగా వ్యవహరించారు. ఉబికి వస్తున్న కన్నీళ్లను పైకి కనిపించకుండా వీడ్కోలు తీసుకున్నారు.



తరగతి గదిలో ఆ నాటి విద్యార్థులు

అలరించిన ముగ్గుల పోటీలు

నాగులుప్పలపాడు: సంక్రాంతి పండగ సందర్భంగా వాసవీ క్లబ్, సంతూర్‌ల సహకారంతో ఉప్పుగుండూరులో నిర్వహించిన నాగులుప్పలపాడు, చినగంజాం, కొరిశపాడు, ఇంకొల్లు మండలాల స్థాయి ముగ్గుల పోటీలు అలరించాయి. పోటీలకు సుమారు 45 మంది హాజరయ్యారు. న్యాయ నిర్ణేతలు నలుగురు విజేతలను ఎంపిక చేశారు. పోటీలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంపీపీ, జెడ్పీటీసీ దంపతులు నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, యాదాల రత్నభారతి అశోక్‌లు మాట్లాడుతూ ముగ్గుల పోటీలను ఇంత పెద్ద ఎత్తున నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. మహిళల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు బహుమతులు అందజేయడం చాలా సంతోషకరమన్నారు. ప్రథమ బహుమతి పొందిన ఇంకొల్లు మండలానికి చెందిన మణి మంజరికి ఫ్రిజ్‌ను బహూకరించారు. వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ ఉమా అన్నపూర్ణ, వాసవీ క్లబ్ ఇంటర్నేషన్‌ల ఉపాధ్యక్షుడు కొంజేటి సురేష్‌బాబు, మాదాసు రాంబాబు, మున్నంగి వెంకట్రావు, తెలగతోటి శ్యామ్యూల్, పులకణం రాజేష్, వేణు పాల్గొన్నారు.



విజేతకు ఫ్రిజ్ బహూకరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ దంపతులు

నేటి నుంచి ప్రత్యేక పూజలు

ఒంగోలు టౌన్: శ్రీగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నేటి నుంచి 16వ తేదీ వరకు ధనుర్మాస ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఆలూరు వేంకట రమణారావు శుక్రవారం తెలిపారు. శనివారం సాయంత్రం 6 గంటలకు శ్రీవారికి చంద్రప్రభ వాహన సేవ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అన్నమయ్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు ఐ.మురళీకృష్ణ నేతృత్వంలో భక్తి సంగీత విభావరి జరుగుతుంది. 15వ తేదీ సాయంత్రం శ్రీవారికి ఊంజల్ సేవ, శ్రీగిరి ఆస్థాన సంగీత విద్వాంసులు వీవీఎస్ వినోద్ కుమార్ బృందం సంగీత విభావరి ఉంటుంది. 16వ తేదీ సాయంత్రం శ్రీవారికి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. అద్దంకికి చెందిన స్వర్ణ సుబ్బారావు బృందంతో కోలాటం ప్రదర్శన ఉంటుంది. ధనుర్మాస ప్రత్యేక కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

శ్రీవారికి మేల్ చాట్ వస్త్రాల సమర్పణ

ధనుర్మాసాన్ని పురస్కరించుకొని నగరంలోని కుర్తాళం శ్రీసిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీవేంకటేశ్వర స్వామి వారికి కట్టా తేజస్వి కుటుంబ సభ్యులు మేల్ చాట్ వస్త్రాలు సమర్పించారు. శ్రీవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన ఆలయ అర్చకులు, వేద పండితులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు పాల్గొన్నారు.



మేల్ చాట్ వస్త్రాలు సమర్పిస్తున్న తేజస్వి కుటుంబ సభ్యులు

సాక్షి బిజినెస్
శనివారం
14-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	303	60,261
నిఫ్టీ ▲	98	17,957

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	10,978	▽	23
డోజోన్స్	34,193	▲	3
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,844	▲	50
డాక్స్	15,087	▲	28
షాంఘై	3,195	▲	31
నికాయ్	26,120	▽	330

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	56,462 ▲	352
బంగారం (99.5 స్వచ్ఛత)	56,236 ▲	351
వెండి (కేజీ)	68,115 ▲	90

ఫారెక్స్ రేట్లు రూ.లలో			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		79.50	83.18
£	బ్రిటన్ పౌండ్		96.84	101.69
€	యూరో		85.71	90.23
¥	జపాన్ ఎన్ (100)		50.00	76.00
AU$	ఆస్ట్రేలియా డాలర్		54.20	59.09
S$	సింగపూర్ డాలర్		59.21	63.76
SAR	సౌదీ రియాల్		20.69	22.36
UAE D	యూఏఈ దిర్హామ్		21.25	23.04
¥	చైనా యువాన్		10.98	13.01

డిజిటల్ వినియోగానికి ఎదురుదెబ్బ: గూగుల్

న్యూఢిల్లీ: గుత్తాధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందంటూ కాంపిటీషన్ కమిషన్ (సీసీఐ) తమకు జరిమానా విధించడంపై టెక్ దిగ్గజం గూగుల్ స్పందించింది. కనెక్టివిటీకి అడ్డంకులను తొలగించే దిశగా సురక్షితమైన స్మార్ట్‌ఫోన్లను అందుబాటులోకి తేవాల్సిన దశలో ఇలాంటి ఆదేశాలు ఇవ్వడం వల్ల దేశీయంగా డిజిటల్ వినియోగం వేగవంతం కాకుండా విఘాతం కలుగుతుందని వ్యాఖ్యానించింది. గూగుల్ ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టం విషయంలో గుత్తాధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందంటూ రూ. 1,338 కోట్లు, ప్లే స్టోర్‌కి సంబంధించి అనుచిత విధానాలపై మరో రూ. 936 కోట్ల మొత్తాన్ని సీసీఐ జరిమానా విధించిన సంగతి తెలిసిందే.

క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ నుంచి వరి సంరక్షణా పురుగు మందు

హైదరాబాద్: వరి పంట రక్షణ, రైతులకు లాభదాయకత పెంపు లక్ష్యంగా క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ సంస్థ మార్కెట్లోకి సరికొత్త పురుగుమందును ఆవిష్కరించింది. పంట సమయంలో చీడపీడలను నియంత్రించడమే కాకుండా, వరి పంట మొత్తాన్ని సురక్షితంగా ఉంచడానికి, దిగుబడిని పెంచడానికి, నాణ్యమైన ఉత్పత్తికి 'మెంటార్' పేరుతో విడుదలైన ఈ ప్రొడక్ట్ దోహదపడుతుందని ఈ మేరకు వెలువడిన ఒక ప్రకటన వివరించింది. దేశవ్యాప్తంగా వివిధ అగ్రి విశ్వవిద్యాలయాలలో మెంటర్‌ను పరీక్షించడం జరిగిందని ప్రకటన తెలిపింది. వరి పంట విషయంలో చీడపీడలను అరికట్టడంలో ఇది ప్రభావవంతంగా పనిచేస్తున్నట్లు పేర్కొంది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
14-1-2023	
విశాఖ	572-00
చిత్తూరు	568-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	563-00
విజయవాడ	563-00
రిటైల్ ధర (డజను)	84.00
13-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	563-00
వరంగల్	565-00
రిటైల్ ధర	6.20

విప్రో లాభం రూ. 3,053 కోట్లు

- క్యూ3 ఫలితాల విడుదల
- ఆదాయం రూ. 23,229 కోట్లు
- 4.3 బిలియన్ డాలర్ల ఆర్డర్లు
- 2,58,744కు మొత్తం సిబ్బంది

న్యూఢిల్లీ: ఐటీ సేవల దిగ్గజం విప్రో లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 2.8 శాతం బలపడి రూ. 3,053 కోట్లను తాకింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 2,969 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 14 శాతం ఎగసి రూ. 23,229 కోట్లకు చేరింది. మార్చితో ముగియనున్న పూర్తి ఏడాదికి ఐటీ సర్వీసుల ఆదాయం 11.5–12 శాతం మధ్య పుంజుకోనున్నట్లు తాజాగా అంచనా(గైడెన్స్) ప్రకటించింది. వాటాదారులకు షేరుకి రూ. 1 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది. ఈ ఏడాది క్యూ2(జూలై–సెప్టెంబర్)తో పోలిస్తే నికర లాభం 15 శాతం, ఆదాయం 3 శాతం వృద్ధి చూపాయి.



ఫలితాలను ప్రకటిస్తున్న విప్రో సీఈవో, ఎండీ థియరీ డెలాపోర్ట్

డీల్స్ రికార్డ్..

ప్రపంచ అనిశ్చితుల్లోనూ క్యూ3లో రికార్డ్ నెలకొల్పుతూ మొత్తం 4.3 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులు కుదుర్చుకున్నట్లు విప్రో సీఈవో, ఎండీ థియరీ డెలాపోర్ట్ పేర్కొన్నారు. ఇది 26 శాతం వృద్ధికాగా.. వీటిలో బిలియన్ డాలర్ల విలువకు మించిన భారీ ఆర్డర్లను సైతం పొందినట్లు తెలియజేశారు. క్యూ4(జనవరి–మార్చి)లోనూ ఇదే స్థాయి ఆర్డర్లు పొందే వీలున్నట్లు అంచనా వేశారు. క్లయింట్లతో లోతైన సంబంధాల ద్వారా అత్యధిక స్థాయిలో డీల్స్ కుదుర్చుకోగలుగుతున్నట్లు వివరించారు. ట్రాన్స్‌ఫార్మేషన్ లక్ష్యాలు, వ్యయ క్రమబద్ధీకరణ తదితర అంశాలలో క్లయింట్లకు అందిస్తున్న సమర్థవంత సేవలు ఇందుకు దోహదపడుతున్నట్లు తెలియజేశారు. పూర్తిస్థాయి క్లౌడ్ సర్వీసులు, ఇంజనీరింగ్ సర్వీసులు ఆర్డర్‌బుక్‌కు దన్నుగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇతర హైలైట్స్

- క్యూ2తో పోలిస్తే విప్రో ఉద్యోగుల సంఖ్య నికరంగా 435 తగ్గి 2,58,744ను తాకింది.
- ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 1.8 శాతం తగ్గి 21.2 శాతానికి చేరింది.
- ఐటీ సర్వీసుల నిర్వహణ మార్జిన్లు 1.2 శాతం బలపడి 16.3 శాతానికి చేరాయి.
- ఐటీ సర్వీసుల ఆదాయం 6.2 శాతం వృద్ధితో 280.35 కోట్ల డాలర్లను తాకింది.
- ఐటీ ప్రొడక్టుల ఆదాయం 2.08 కోట్ల డాలర్లు(రూ. 170 కోట్లు)గా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో విప్రో షేరు యథాతథంగా రూ. 396 వద్ద ముగిసింది.

3 రోజుల నష్టాలకు చెక్

ముంబై: ద్రవ్యోల్బణ ఆందోళనలు ఉపశమించిన నేపథ్యంలో మూడు రోజుల వరుస నష్టాలకు చెక్ పడింది. మెటల్, ఫైనాన్షియల్స్, ఐటీలో కొనుగోళ్ల దేశీ స్టాక్ మార్కెట్లు జోష్‌నిచ్చాయి. వెరసి సెన్సెక్స్ ట్రిపుల్ సెంచరీ చేసి 60,000 మార్క్‌ను అధిగమించింది. 303 పాయింట్లు జమ చేసుకుని 60,261 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 98 పాయింట్లు ఎగసి 17,957 వద్ద నిలిచింది. ఒక దశలో సెన్సెక్స్ 460 పాయింట్లు జంప్‌చేయగా.. నిఫ్టీ 18,000 స్థాయికి చేరువైంది. అయితే తొలుత మార్కెట్లు నష్టాలతో ప్రారంభమయ్యాయి. తదుపరి ట్రేడర్లు షార్ట్ కవరింగ్ చేపట్టడంతో మిడ్ సెషన్ నుంచీ జోరందుకున్నట్లు విశ్లేషకులు తెలియజేశారు.

కన్జూమర్ డ్యూరబుల్స్ వీక్

ఎన్ఎస్ఈలో ప్రధానంగా మెటల్, బ్యాంకింగ్, ఐటీ, ఆటో రంగాలు 1.3–0.6 శాతం మధ్య పుంజుకోగా... కన్జూమర్ డ్యూరబుల్స్ 1 శాతం నీరసించింది. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ఎంటర్, ఇండస్‌ఇండ్, ఐషర్, టాటా స్టీల్, ఇన్ఫోసిస్, దివీస్, హీరో మోటో, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్, బీపీసీఎల్, ఐసీఐసీఐ, హెచ్‌యూఎల్, టీసీఎస్, ఎయిర్‌టెల్, మారుతీ, ఎస్‌బీఐ 2–1 శాతం మధ్య బలపడ్డాయి. అయితే టైటన్, ఎస్‌బీఐ లైఫ్, అపోలో హాస్పిటల్స్,



నెస్లే, ఎల్అండ్‌టీ 1–0.5 శాతం మధ్య క్షీణించాయి.

స్టాక్ హైలైట్స్

- క్యూ3లో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 716 కోట్ల అమ్మకాలు సాధించినట్లు వెల్లడించడంతో రియల్టీ కంపెనీ కోల్టేపాటిల్ డెవలపర్స్ 16% దూసుకెళ్లింది. రూ. 303 వద్ద ముగిసింది. తొలుత రూ. 312ను సైతం అధిగమించింది.
- చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్టు నుంచి తాజాగా రూ. 1,134 కోట్ల విలువైన ఆర్డర్ పొందడంతో రైల్ వికాస్ నిగమ్(ఆర్‌వీఎన్ఎల్) కౌంటర్ 5 శాతం ఎగసి రూ. 80 వద్ద ముగిసింది.
- కొద్ది రోజులుగా ర్యాలీ బాటలో సాగుతున్న ఆర్కియన్ కెమికల్స్ షేరు మరోసారి 8 శాతం జంప్‌చేసి రూ.617 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ.629 వద్ద కొత్త గరిష్టాన్ని తాకింది.

ప్రభుత్వ, ప్రైవేటు రంగం కలసి పనిచేయాలి

- అవకాశాలను సొంతం చేసుకోవాలి
- ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- బడ్జెట్‌కు ముందు ఆర్థికవేత్తలతో చర్చలు

న్యూఢిల్లీ: ప్రభుత్వ, ప్రైవేటు రంగం కలసికట్టుగా పనిచేయాలని, అంతర్జాతీయంగా ఉన్న పరిణామాల నేపథ్యంలో తమ పరిధి దాటి విశాల దృక్పథంతో ఆలోచించి అవకాశాలను సొంతం చేసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్‌కు ముందు ప్రముఖ ఆర్థికవేత్తలతో శుక్రవారం ప్రధాని సమావేశమయ్యారు. వారి అభిప్రాయాలు, సూచనలను తెలుసుకున్నారు. డిజిటల్ కార్యకలాపాల విషయంలో, ఫిన్‌టెక్ విస్తరణలో దేశం సాధించిన విజయాన్ని ప్రధాని ఈ సందర్భంగా ప్రశంసించినట్టు అధికారికంగా ఓ ప్రకటన విడుదలైంది. సమ్మిళిత వృద్ధికి ఇది కీలకమని ప్రధాని అభిప్రాయపడ్డారు. భారత్ వృద్ధిలో మహిళల పాత్ర కీలకమని పేర్కొంటూ, ఉత్పాదకతలో మహిళలను మరింతగా భాగస్వాములను చేయాలని కోరారు. రిస్కులు ఉన్నప్పటికీ అంతర్జాతీయంగా డిజిటైజేషన్, ఇంధనం, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం రంగాల్లో విస్తతమైన అవకాశాలున్నట్టు ప్రధాని పేర్కొన్నారు. ఈ అవకాశాలను సొంతం చేసుకునేందుకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు కలసి పనిచేయాలని పిలుపునిచ్చారు. భారత్ తన వృద్ధిని స్థిరంగా కొనసాగించేందుకు తీసుకోవాల్సిన చర్యలను ఆర్థికవేత్తలు ఈ సమావేశంలో ప్రధానికి సూచించినట్టు ప్రభుత్వ ప్రకటన తెలిపింది. అంతర్జాతీయంగా ప్రస్తుతం నెలకొన్న సమస్యలు కొనసాగుతాయంటూ, భారత్ మరింత బలమైన వృద్ధిని నమోదు చేసేందుకు చర్యలను ప్రతిపాదించినట్టు పేర్కొంది. ఈ సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బెరీ, ఉన్నతాధికారులతోపాటు.. ఆర్థికవేత్తలు శంకర్ ఆచార్య, అశోక్ గులాటీ, షమిక రవి తదితరులు పాల్గొన్నారు.



ఇతర రంగాలకూ పీఎల్ఐ స్కీమ్

- రానున్న సంవత్సరాల్లో వచ్చే చాన్స్
- బడ్జెట్‌లో డిమాండ్ బలోపేతానికి చర్యలు
- పరిశ్రమ వర్గాల ఆశాభావం

న్యూఢిల్లీ: ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం ఎంతో ప్రయోజనకరమని మెజారిటీ వ్యాపారవేత్తలు భావిస్తున్నారు. రానున్న రోజుల్లో పీఎల్ఐ కింద ఇతర రంగాలకూ ప్రోత్సాహకాలు లభిస్తాయన్న ఆశాభావం వారి నుంచి వ్యక్తమైంది. డిమాండ్ బలోపేతానికి వీలుగా బడ్జెట్‌లో ప్రకటించే చర్యలు అన్ని రంగాల్లో వృద్ధికి ఊతంగా నిలుస్తాయన్న అభిప్రాయం కంపెనీల ప్రతినిధుల్లో వ్యక్తమైంది. మూలధన వ్యయాలపైనా బడ్జెట్ దృష్టి సారిస్తుందని అంచనా వేస్తున్నారు. డెలాయిట్ సర్వే వివిధ రంగాల్లోని పారిశ్రామికవేత్తల అభిప్రాయాలను తెలుసుకుంది. మూలధన వ్యయాలు, మౌలిక సదుపాయాలకు రుణాలను అందించడం వృద్ధికి కీలకమన్న అభిప్రాయం వ్యక్తమైంది. భారత ప్రభుత్వ బాండ్ల ద్వారా నిధులు సమీకరించాలని సర్వేలో 60



శాతం మంది సూచించారు. రానున్న బడ్జెట్ నుంచి పరిశ్రమ ఏమి ఆశిస్తుందో తెలుసుకునే ప్రయత్నం సర్వేలో భాగంగా డెలాయిట్ చేసింది. 10 రంగాల నుంచి 181 మంది ప్రతినిధులు సర్వేలో పాల్గొని అభిప్రాయాలు తెలియజేశారు.

పారిశ్రామికవేత్తల అభిప్రాయాలు

- 70 శాతానికి పైగా పరిశ్రమల ప్రతినిధులు పీఎల్ఐ పథకం తమ రంగం వృద్ధికి మేలు చేస్తుందని చెప్పారు.
- 60% మంది పీఎల్ఐ ప్రోత్సాహకాలను మరిన్ని రంగాలకు ప్రకటిస్తారని ఆశిస్తున్నారు.
- పన్నుల్లో మార్పులు తెస్తే అది పరిశ్రమల వృద్ధికి ప్రయోజనం కలిగిస్తుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. రానున్న బడ్జెట్‌లో ఎక్కువ మంది బలంగా దీన్ని కోరుకుంటున్నారు.
- ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు పెట్టుబడుల వృద్ధికి దోహదం చేస్తాయని భావిస్తున్నారు.
- ఎంఎస్ఎంఈలను జీఎస్టీ కిందకు తీసుకొస్తే పరిశ్రమల వృద్ధి స్థిరత్వానికి సాయపడుతుందని, వాణిజ్య లావాదేవీలు పెరుగుతాయని చెప్పారు.
- 45 శాతం మంది పన్ను బాధ్యతలను ప్రభుత్వం తగ్గిస్తుందని అంచనా వేస్తుంటే, 44 శాతం మంది టీడీఎస్‌కు సంబంధించి స్పష్టత కోరుకుంటున్నారు.
- మూలధన లాభాల పన్ను నిర్మాణాన్ని మరింత సులభతరంగా మార్చాలని పరిశ్రమ కోరుతోంది.
- కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 14 రంగాలకు పీఎల్ఐ కింద రూ. 2 లక్షల కోట్ల ప్రోత్సాహకాలను ప్రకటించింది. తోలు, సైకిల్, టీకాల తయారీ, టెలికం ఉత్పత్తులకు పీఎల్ఐ విస్తరణ ప్రతిపాదన పరిశీలనలో ఉంది.

సాక్షి స్పోర్ట్స్



నేటి నుంచి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ టోర్నీ

దక్షిణాఫ్రికా వేదికగా నేటి నుంచి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ జరగనుంది. 16 జట్లు తలపడుతున్న ఈ టోర్నీ ఈనెల 29న జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది. గ్రూప్ 'ఎ'లో ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, శ్రీలంక, అమెరికా; గ్రూప్ 'బి'లో ఇంగ్లండ్, పాకిస్తాన్, జింబాబ్వే, రువాండా; గ్రూప్ 'సి'లో ఇండోనేసియా, ఐర్లాండ్, న్యూజిలాండ్, వెస్టిండీస్; గ్రూప్ 'డి'లో భారత్, దక్షిణాఫ్రికా, స్కాట్లాండ్, యూఏఈ జట్లున్నాయి. నేడు జరిగే తమ తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో భారత్ ఆడుతుంది. భారత జట్టులో హైదరాబాద్ అమ్మాయి గొంగడి త్రిష, వైజాగ్‌కు చెందిన షబ్నమ్ సభ్యులుగా ఉన్నారు.

టెన్నిస్‌కు సానియా గుడ్‌బై

వచ్చే నెలలో రిటైర్ కానున్న భారత స్టార్

మెల్‌బోర్న్: భారత వెటరన్ టెన్నిస్ స్టార్ సానియా మీర్జా ఫిబ్రవరిలో జరిగే దుబాయ్ ఓపెన్ తర్వాత రిటైర్ అవుతున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఆమె ట్విట్టర్‌లో భావోద్వేగపు లేఖను 'లైఫ్ అప్‌డేట్' అనే క్యాప్షన్‌తో పంచుకుంది. మూడు పేజీల ఈ లేఖలో తన 30 ఏళ్ల రాకెట్ పయనాన్ని, చివరి గమ్యాన్ని వివరించింది. 'నా గ్రాండ్‌స్లామ్ ప్రయాణం 2005లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌తోనే మొదలైంది. ఇప్పుడు గ్రాండ్‌స్లామ్ ఆట కూడా అక్కడే ముగించేందుకు సరైన వేదిక అనుకుంటున్నా. 18 ఏళ్ల క్రితం ఎక్కడైతే ఆరంభించానో అక్కడే ఆపేయబోతున్నా. ఇక కెరీర్‌లో చివరి టోర్నీ మాత్రం దుబాయ్ ఓపెన్. ఫిబ్రవరిలో ఈ టోర్నీతో సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతాను. ఇన్నేళ్ల పయనంలో ఎన్నో ఆటుపోట్లే కాదు మరెన్నో మధురస్మృతులూ ఉన్నాయి' అని అందులో పేర్కొంది. నాసర్ స్కూల్‌కు చెందిన ఆరేళ్ల బాలిక ఎలా టెన్నిస్ నేర్చుకుంది... తన కలలకు ఎక్కడ బీజం పడింది... అన్నింటికీ మించి దేశానికి ప్రాతినిధ్యం ఎలాంటి స్ఫూర్తినిచ్చిందో ఆ లేఖలో చెప్పుకొచ్చింది. అర్ధ సెంచరీని దాటిన తన గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో గెలిచిన కొన్ని టైటిళ్లు దేవుడిచ్చిన వరమంది. 'నా సుదీర్ఘ కెరీర్‌లో దేశానికి పతకాలు తేవడమే అతిపెద్ద గౌరవంగా భావిస్తాను. పతకం నా మెడలో పడినపుడు జాతీయ పతాకం రెపరెపలాడినపుడు కలిగే ఆనందం అన్నింటికి మించి ఉంటుంది. ఇప్పుడు దీన్ని తలచుకొని రిటైర్మెంట్ సందేశం రాస్తున్నప్పుడు చెరిగిపోని ఆ అనుభూతి నా కళ్లను చెమరుస్తోంది' అని 36 ఏళ్ల సానియా పేర్కొంది.



భారత్ శుభారంభం

నాలుగోసారి ప్రపంచకప్ పురుషుల హాకీ టోర్నీకి ఆతిథ్యమిస్తున్న భారత జట్టు ఆనవాయితీని కొనసాగించింది. స్వదేశంలో జరిగిన గత మూడు ప్రపంచకప్‌లలో భారత జట్టు తాము ఆడిన తొలి మ్యాచ్‌లో విజేతగా నిలిచింది. నాలుగోసారీ ఈ ఫలితంలో మార్పు లేకుండా చూసుకున్న టీమిండియా ఈ మెగా ఈవెంట్‌లో శుభారంభం చేసింది. 48 ఏళ్లుగా ఊరిస్తున్న ప్రపంచకప్ టైటిల్ వేటను విజయంతో మొదలుపెట్టింది.

- తొలి మ్యాచ్‌లో స్పెయిన్‌పై 2–0తో విజయం
- ప్రపంచకప్ హాకీ టోర్నీ

రూర్కెలా (ఒడిశా): సొంతగడ్డపై తమ సత్తా చాటుకుంటూ భారత పురుషుల హాకీ జట్టు ప్రపంచకప్ టోర్నీలో బోణీ కొట్టింది. స్పెయిన్ జట్టుతో శుక్రవారం జరిగిన పూల్ 'డి' తొలి లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని భారత జట్టు 2–0 గోల్స్ తేడాతో గెలుపొందింది. ఆట 12వ నిమిషంలో వైస్ కెప్టెన్ అమిత్ రోహిదాస్... 26వ నిమిషంలో హార్దిక్ సింగ్ ఒక్కో గోల్ సాధించి భారత విజయంలో కీలకపాత్ర పోషించారు. ఆద్యంతం భారత్ ఆధిపత్యం చలాయించిన ఈ మ్యాచ్‌లో టీమిండియాకు ఐదు పెనాల్టీ కార్నర్‌లు రాగా... స్పెయిన్ మూడు పెనాల్టీ కార్నర్‌లు సంపాదించింది. భారత్ ఐదు పెనాల్టీ కార్నర్‌లలో ఒక దానిని సద్వినియోగం చేసుకోగా... స్పెయిన్ మూడింటినీ వృథా చేసుకుంది. ఆదివారం జరిగే తమ తదుపరి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌తో భారత్ ఆడుతుంది.

స్పెయిన్‌తో మ్యాచ్‌లో భారత్ సంపూర్ణ ఆధిపత్యాన్ని కనబరిచింది. అవకాశం దొరికినపుడల్లా భారత ఆటగాళ్లు నీలకంఠ శర్మ, మన్‌దీప్ సింగ్, ఆకాశ్‌దీప్ సింగ్, అభిషేక్ గోల్‌పోస్ట్‌పై దాడులు చేసినా స్పెయిన్ అప్రమత్తంగా ఉంటూ వాటిని నిలువరించింది. లేదంటే భారత్ ఖాతాలో మరిన్ని గోల్స్ చేరేవి. 12వ నిమిషంలో లభించిన రెండో పెనాల్టీ కార్నర్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ డ్రాగ్ ఫ్లిక్ చేయగా... బంతి స్పెయిన్ డిఫెండర్‌కు తగిలి వెనక్కి వచ్చింది. అక్కడే ఉన్న అమిత్ రోహిదాస్ బంతిని లక్ష్యానికి చేర్చడంతో భారత్ ఖాతా తెరిచింది. అనంతరం 26వ నిమిషంలో ఎడమ వైపు నుంచి హార్దిక్ సింగ్ దూసుకొస్తూ అదే జోరులో క్రాస్ షాట్‌తో బంతిని స్పెయిన్ గోల్‌పోస్ట్‌లోనికి పంపించాడు. దాంతో భారత ఆధిక్యం 2–0కు పెరిగింది. మూడో క్వార్టర్‌లో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ స్ట్రోక్‌ను వృథా చేయడం గమనార్హం. తొలి రోజు జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో పూల్ 'ఎ'లో అర్జెంటీనా 1–0తో దక్షిణాఫ్రికాపై... మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా 8–0తో ఫ్రాన్స్‌పై గెలుపొందగా... పూల్ 'డి'లోని మరో మ్యాచ్‌లో ఇంగ్లండ్ 5–0తో వేల్స్ జట్టును ఓడించింది.


అమిత్ రోహిదాస్

8 ప్రపంచకప్ టోర్నీలలో తాము ఆడిన తొలి మ్యాచ్ లో భారత్ గెలుపొందడం ఇది ఎనిమిదో సారి. 15వసారి ప్రపంచకప్ జరుగుతుండగా... భారత్ రెండుసార్లు తమ తొలి మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొని, ఐదుసార్లు తమ తొలి మ్యాచ్‌లో ఓడిపోయింది.

సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జోడీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఏడో సీడ్ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ ద్వయం 17–21, 22–20, 21–9తో లియు యు చెన్–జువాన్ యి ఒయు (చైనా) జోడీపై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ ప్రణయ్ 16–21, 21–19, 12–21తో ప్రపంచ ఏడో ర్యాంకర్ కొడాయ్ నరోకా (జపాన్) చేతిలో ఓడిపోయాడు. ప్రణయ్‌కు 6,875 డాలర్ల (రూ. 5 లక్షల 60 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 6,600 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ఆంధ్ర జట్టుకు నిరాశ

ఢిల్లీకి తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం

న్యూఢిల్లీ: చివరి వికెట్ తీయడంలో విఫలమైన ఆంధ్ర జట్టు బౌలర్లు ఢిల్లీ జట్టుతో జరిగిన రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కోల్పోయారు. మ్యాచ్ 'డ్రా'గా ముగిసినా 29 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించినందుకు ఢిల్లీ జట్టుకు మూడు పాయింట్లు లభించగా... ఆంధ్ర ఖాతాలో ఒక పాయింట్ మాత్రమే చేరింది. ఓవర్‌నైట్ స్కోరు 300/4తో ఆట చివరిరోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఢిల్లీ జట్టు 9 వికెట్లకు 488 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ బ్యాటర్లలో ధ్రువ్ షోరే మరో 43 పరుగులు జోడించి వ్యక్తిగత స్కోరు 185 వద్ద అవుటవ్వగా... హిమ్మత్ సింగ్ (104; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. హిమ్మత్ సింగ్ అవుటైనపుడు ఢిల్లీ స్కోరు 423/9. చివరి వికెట్ తీసిఉంటే ఆంధ్ర జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతోపాటు మూడు పాయింట్లు లభించేవి. కానీ ఢిల్లీ బ్యాటర్లు హర్షిత్ రాణా (46 బంతుల్లో 33 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), దివిజ్ మెహ్రా (38 బంతుల్లో 32 నాటౌట్; 6 ఫోర్లు) మొండి పట్టుదలతో ఆడి చివరి వికెట్‌కు అజేయంగా 65 పరుగులు జోడించారు. ఐదు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న ఆంధ్ర గ్రూప్ 'బి' 13 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది.


హిమ్మత్

భారత టెస్టు జట్టులోకి సూర్యకుమార్

- ఇషాన్ కిషన్‌కు తొలిసారి పిలుపు
- ఆసీస్‌తో తొలి రెండు టెస్టులకు జట్టు ప్రకటన

ముంబై: ఆస్ట్రేలియాతో సొంతగడ్డపై జరిగే 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'లోని తొలి రెండు టెస్టుల కోసం 17 మంది సభ్యులతో భారత జట్టును సెలక్టర్లు ప్రకటించారు. టి20లో తన విధ్వంసక ఆటతో చెలరేగుతున్న సూర్యకుమార్ యాదవ్ తొలిసారి టెస్టు టీమ్‌లోకి ఎంపికయ్యాడు. ఇప్పటి వరకు టెస్టుల్లో అవకాశం రాకపోయినా ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లోనూ సూర్యకు మంచి రికార్డే ఉంది. 79 మ్యాచ్‌లలో అతను 44.75 సగటుతో 5549 పరుగులు చేయగా, ఇందులో 14 సెంచరీలు ఉన్నాయి. మరోవైపు కారు ప్రమాదానికి గురైన వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఇప్పట్లో కోలుకునే అవకాశం లేకపోవడంతో ప్రత్యామ్నాయ వికెట్ కీపర్‌గా ఇషాన్ కిషన్‌ను ఎంపిక చేశారు. ఆంధ్ర ఆటగాడు కోన శ్రీకర్ (కేఎస్) భరత్ ఇప్పటికే టెస్టు టీమ్‌తో ఉండగా (ఇంకా మ్యాచ్ ఆడలేదు), కిషన్‌కు టెస్టుల్లో ఇదే తొలి అవకాశం. బుమ్రాను ఎంపిక చేయకపోవడంతో అతను పూర్తిగా కోలుకోలేదని తేలింది. గాయం నుంచి కోలుకుంటున్న రవీంద్ర జడేజానూ జట్టులోకి తీసుకున్నా... ఫిట్‌నెస్ నిరూపించుకుంటేనే ఆడతాడు. భారత్, ఆస్ట్రేలియా మధ్య ఫిబ్రవరి 9నుంచి నాగపూర్‌లో తొలి టెస్టు జరుగుతుంది.

టెస్టు జట్టు వివరాలు: రోహిత్ శర్మ (కెప్టెన్), రాహుల్, గిల్, పుజారా, కోహ్లి, శ్రేయస్, కేఎస్ భరత్, ఇషాన్ కిషన్, అశ్విన్, అక్షర్, కుల్దీప్, జడేజా, షమీ, సిరాజ్, ఉమేశ్, ఉనాద్కట్, సూర్యకుమార్.


సూర్య, ఇషాన్

న్యూజిలాండ్‌దే సిరీస్

కరాచీ: పాకిస్తాన్ గడ్డపై మూడు మ్యాచ్‌ల ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను న్యూజిలాండ్ జట్టు తొలిసారి సొంతం చేసుకుంది. పాకిస్తాన్‌తో శుక్రవారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో న్యూజిలాండ్ రెండు వికెట్ల తేడాతో గెలిచింది. తద్వారా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను న్యూజిలాండ్ 2–1తో దక్కించుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 280 పరుగులు చేసింది. ఫఖర్ జమాన్ (101; 10 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించాడు. మొహమ్మద్ రిజ్వాన్ (77; 6 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. కివీస్ బౌలర్లలో టిమ్ సౌతీ (3/56) ఆకట్టుకున్నాడు. అనంతరం న్యూజిలాండ్ 48.1 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 281 పరుగులు చేసి విజయం సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' డెవాన్ కాన్వే (52; 5 ఫోర్లు, 1 సిక్స్), విలియమ్సన్ (53; 2 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గ్లెన్ ఫిలిప్స్ (42 బంతుల్లో 63 నాటౌట్; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించి న్యూజిలాండ్ విజయంలో కీలకపాత్ర పోషించారు. పాక్‌తో సిరీస్ ముగించుకున్న న్యూజిలాండ్ ఈనెల 18 నుంచి భారత్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడనుంది.

టి20లకు పృథ్వీ షా, వన్డేల్లో భరత్

న్యూజిలాండ్‌తో సిరీస్‌లకు భారత జట్లు

ముంబై: ఏడాదిన్నర క్రితం అంతర్జాతీయ టి20ల్లో తాను ఆడిన ఏకైక టి20లో తొలి బంతికే అవుటైన పృథ్వీ షా భారత జట్టులోకి పునరాగమనం చేశాడు. న్యూజిలాండ్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల సిరీస్ కోసం సెలక్టర్లు అతడికి అవకాశం కల్పించారు. ఇది మినహా చెప్పుకోదగ్గ మార్పులేమీ లేకుండా ఇటీవల శ్రీలంకతో టి20 సిరీస్ గెలిచిన జట్టునే ఎంపిక చేశారు. కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యా కొనసాగనున్నాడు. ఈ సిరీస్‌లో కూడా రోహిత్, కోహ్లిలను ఎంపిక చేయకపోవడంతో అది 'విశ్రాంతి'నా లేక టి20 భవిష్యత్ ప్రణాళికల్లో భాగంగా వారిని పక్కన పెట్టేశారా అనేదానిపై స్పష్టత లేదు. జనవరి 27, 29, ఫిబ్రవరి 1 తేదీల్లో టి20 మ్యాచ్‌లు జరుగుతాయి. వన్డే జట్టులో ఆంధ్ర వికెట్ కీపర్ కేఎస్ భరత్‌కు తొలిసారి అవకాశం లభించింది. శార్దుల్ ఠాకూర్ పునరాగమనం చేయగా, లెఫ్టార్మ్ స్పిన్నర్ షహబాజ్ అహ్మద్‌కు కూడా చోటు కల్పించారు. వన్డేల్లో మాత్రం రోహిత్, కోహ్లి అందుబాటులో ఉంటారు. వ్యక్తిగత కారణాలతో కేఎల్ రాహుల్, అక్షర్‌లను రెండు జట్లలోనూ ఎంపిక చేయలేదని సెలక్టర్లు వెల్లడించారు. ఈ నెల 18, 21, 24 తేదీల్లో వన్డేలు జరుగుతాయి.

వన్డే జట్టు: రోహిత్ (కెప్టెన్), గిల్, ఇషాన్ కిషన్, కోహ్లి, శ్రేయస్, సూర్యకుమార్, భరత్, హార్దిక్, సుందర్, షహబాజ్, శార్దుల్, చహల్, కుల్దీప్, షమీ, సిరాజ్, ఉమ్రాన్. **టి20 జట్టు:** హార్దిక్ (కెప్టెన్), సూర్యకుమార్, ఇషాన్ కిషన్, రుతురాజ్, గిల్, దీపక్ హుడా, రాహుల్ త్రిపాఠి, జితేశ్ శర్మ, సుందర్, కుల్దీప్, చహల్, అర్ష్‌దీప్, ఉమ్రాన్, మావి, పృథ్వీ షా, ముకేశ్ కుమార్.


భరత్